AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
10-12-2025 (Wednesday) MAIN EDITION

## అదరగొట్టిన మీషో ఐపీవో




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** దేశీయ స్టాక్ మార్కెట్‌లో బుధవారం మూడు మెయిన్ బోర్డ్ కంపెనీలు లిస్టయ్యాయి. ఇందులో మీషో లిస్టింగ్‌లో అదరగొట్టింది. ప్రారంభ సమయంలోనే 46 శాతానికిపైగా లాభాలను అందించింది. ఈ కంపెనీ మార్కెట్ నుంచి రూ. 5,421 కోట్లు సమీకరించింది. ఇందులో ఫ్రెష్ ఇష్యూతో పాటు ఆఫర్ ఫర్ సేల్ కూడా ఉంది. కంపెనీ ఒక్కో ఈక్విటీ షేరు ధరను గరిష్ట ప్రైస్ బ్యాండ్ వద్ద రూ. 111గా నిర్ణయించింది. ఈ కంపెనీ షేర్లు బుధవారం స్టాక్ మార్కెట్‌లో రూ. 51.50 ప్రీమియంతో రూ. 162.50 వద్ద లిస్టయ్యాయి.

## దీపావళికి యునెస్కో గుర్తింపు




**అక్షరటుడే, ఢిల్లీ:** వెలుగు దివ్వెల దీపాల పండుగకు అంతర్జాతీయంగా అరుదైన గౌరవం దక్కింది. యునెస్కో ఇన్‌టాంజిబుల్ కల్చరల్ హెరిటేజ్ జాబితాలో ఈ పండుగను చేర్చారు. ఢిల్లీలోని ఎర్రకోట వద్ద నిర్వహించిన సమావేశంలో యునెస్కో ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో భారత్‌కు చెందిన 15 అంశాలు యునెస్కో వారసత్వ గుర్తింపు పొందాయి. వీటిలో కుంభమేళా, కోల్‌కతా దుర్గాపూజ, గర్బా నృత్యం, యోగా, వేద పఠన సంప్రదాయం, రామాయణ గాథను ప్రదర్శించే రామ్‌లీల మొదలైనవి ఉన్నాయి.

## కార్పొరేషన్ ఛైర్మన్ పదవుల భర్తీ



**అక్షరటుడే, హైదరాబాద్:** నెలాఖరులోపు కార్పొరేషన్ ఛైర్మన్ల పదవులు భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైందని, ఎన్నో అంతర్జాతీయ కంపెనీలు ఒప్పందాలు చేసుకున్నాయని చెప్పారు. బీఆర్ఎస్ పాలన.. మా రెండేళ్ల పాలనపై చర్చకు మేం సిద్ధంగా ఉన్నామన్నారు.

## మీ డబ్బు.. మీ హక్కు




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** క్లెయిమ్ చేయని ఆస్తుల గురించి ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం 'లింక్డిన్' ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. మరిచిపోయిన, క్లెయిమ్ చేయని నగదును దక్కించుకునేందుకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు. అందుకోసం 'మీ డబ్బు.. మీ హక్కు' మూమెంట్‌లో పాల్గొనాలని సూచించారు.

## వన్డేల్లో రెండో ర్యాంక్‌కు కోహ్లీ



**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో విరాట్ కోహ్లీ రెండో ర్యాంక్ దక్కించుకున్నాడు. మొదటి స్థానానికి అతి చేరువగా వచ్చాడు. ప్రస్తుతం ఆ స్థానంలో రోహిత్ శర్మ ఉన్నాడు. అంతకు ముందు నాలుగో స్థానంలో ఉన్న కోహ్లీ.. న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్, అఫ్గానిస్థాన్ బ్యాటర్ ఇబ్రహీం జద్రాన్‌ను వెనక్కి నెట్టాడు.

## తిరుమలలో సుప్రభాత సేవలు రద్దు



**అక్షరటుడే, తిరుమల :** తిరుమలలో శ్రీవారిని దర్శించుకోవడానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. స్వామివారిని నిత్యం సుప్రభాత సేవతో మేల్కొలిపి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. అయితే ధనుర్మాసం నేపథ్యంలో సుప్రభాత సేవ రద్దు చేసినట్లు టీటీడీ అధికారులు తెలిపారు. తిరుమలలో నిత్యం ఉదయం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. అయితే ప్రతి ఏటా ధనుర్మాసంలో సుప్రభాత సేవను రద్దు చేస్తారు. దానికి బదులు తిరుప్పావై పారాయణం నిర్వహిస్తారు. డిసెంబర్ 16 నుంచి ధనుర్మాసం ప్రారంభం కానుంది. దీంతో ఆ రోజు నుంచి జనవరి 14 వరకు సుప్రభాత సేవ రద్దు చేసినట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు.

## కుల్సుంపుర ఏసీపీపై సస్పెన్షన్ వేటు

**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో మరో పోలీస్ అధికారిపై వేటు పడింది. కుల్సుంపుర ఏసీపీ మునావర్‌ను సస్పెండ్ చేస్తూ సీపీ సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనను హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించడం, అక్రమాలకు పాల్పడుతున్న పోలీసులపై సీపీ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా తాజాగా కుల్సుంపుర ఏసీపీ మునావర్‌పై వేటు వేశారు. ఆయనపై అవినీతి, భూ వివాదాలు, కేసుల తారుమారు ఆరోపణలు వచ్చాయి. పోలీస్ స్టేషన్ల వారీగా వసూళ్లకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసినట్లు సమాచారం.



“ ఉస్మానియా యూనివర్సిటీని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించి, నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. బుధవారం ఆయన యూనివర్సిటీలో పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆర్ట్స్ కాలేజీ ఎదుట బహిరంగ సభలో ప్రసంగించారు.

– అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# అంతర్జాతీయ ప్రమాణాలతో ఓయూ అభివృద్ధి

■ యూనివర్సిటీకి రూ.వెయ్యి కోట్లు కేటాయించాం ■ గుండెల నిండా అభిమానంతో వచ్చా ■ సీఎం రేవంత్‌రెడ్డి

తెలంగాణ గడ్డ నుంచి అనేక పోరాటాలు వచ్చాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చదువు లేకున్నా ఎంతో మంది అణచివేతకు వ్యతిరేకంగా పోరాటం చేశారని గుర్తు చేశారు. సాయుధ పోరాటం జరిపి దొరల పాలనకు ప్రజలు చరమ గీతం పాడారన్నారు. అణిచివేతకు గురైనప్పుడే పోరాటం పుడుతుందన్నారు. అడవుల్లో పుట్టిన కొమురంభీం చదువుకోలేదని, కానీ ఆధిపత్యం చెలాయించినవారిపై కొమురంభీం ఉద్యమాన్ని రగిలించారని గుర్తు చేశారు. బడికి వెళ్లని అందెశ్రీ తెలంగాణ ఉద్యమ గేయాన్ని రచించారని తెలిపారు.

### కాలగర్భంలో కలిపే కుట్ర

తెలంగాణ కోసం ఆరు దశాబ్దాలు ఎదురు చూశామని సీఎం అన్నారు. ఓయూలోనే తొలి దశ ఉద్యమం పుట్టిందన్నారు. ఆ ఉద్యమం ఫలించక పోవడంతోనే విద్యార్థులు అడవి బాట పట్టారని పేర్కొన్నారు. తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమాలకు ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా నిలిచిందన్నారు. అలాంటి యూనివర్సిటీని కొంతమంది కాలగర్భంలో కలిపే ప్రయత్నం చేశారని ఆరోపించారు. పరోక్షంగా కేటీఆర్‌పై విమర్శలు చేశారు. కానీ తమ ప్రభుత్వం యూనివర్సిటీని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతుందన్నారు.

### అభిమానం ఉండాలి

గుండెల నిండా అభిమానంతో ఓయూకు వచ్చానని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఓయూలో మంత్రులు, సీఎంలను అడ్డుకున్న చరిత్ర ఉందని కొందరు తనకు చెప్పారన్నారు. మీరు చాలా ధైర్యం చేస్తున్నారని కొందరు అన్నారని పేర్కొన్నారు. తనది ధైర్యం కాదు, అభిమానం అని సీఎం తెలిపారు. 'నా తమ్ముళ్లు ఉన్న యూనివర్సిటీకి వెళ్లేందుకు ధైర్యం అవసరమా.. గుండెల నిండా అభిమానంతో భవిష్యత్ ప్రణాళిక కోసం ఇక్కడికి వచ్చా' అని స్పష్టం చేశారు.

### ఎందరో వీరులను అందించింది


ఉస్మానియా యూనివర్సిటీ ఎందరో వీరులను తెలంగాణకు అందించిందని సీఎం తెలిపారు. జార్జిరెడ్డి, గద్దర్ వంటి వీరులు ఇక్కడి నుంచే వచ్చారన్నారు. అలాగే అనేక మంది మేధావులు ఇక్కడ చదువుకున్నారని తెలిపారు. తెలంగాణ భవిష్యత్‌కి పునాది వేసింది ఉస్మానియా వర్సిటీ అని చెప్పారు. విశ్వవిద్యాలయం అభివృద్ధికి రూ. 1000 కోట్లు విడుదల చేశామన్నారు. రాష్ట్రంలో విద్య అందుబాటులో ఉంది, కానీ నాణ్యమైన విద్య లేదన్నారు. ఇంజినీర్లకు కొదవ లేదు, కానీ స్కిల్ ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకు స్కిల్ వర్సిటీ ఏర్పాటు చేశామని చెప్పారు.

## ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



**అక్షరటుడే, హైదరాబాద్:** గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి గురువారం జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని తెలిపారు. ఆమె బుధవారం మీడియాతో మాట్లాడారు. బందోబస్తు, శాంతిభద్రతల అంశాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామాల్లో పోలింగ్ పూర్తి కాగానే కౌంటింగ్ జరుగుతుందని చెప్పారు. తొలి విడతలో 395, రెండో విడతలో 495 గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని చెప్పారు. ఇప్పటి వరకు తనిఖీల్లో రూ.8.2 కోట్లు సీజ్ చేశామని వివరించారు. 50వేల మంది సివిల్ పోలీసులు విధుల్లో ఉంటారని, 60 ప్లాటూన్స్ బృందాలు బయటి నుంచి వచ్చాయని ఎస్ఈసీ తెలిపారు.

## ప్రజల ఆకాంక్షల మేరకు పథకాల్లో మార్పులు: సీఎం




**అక్షరటుడే, అమరావతి:** ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పథకాల్లో మార్పులు, చేర్పులు జరగాలని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. సచివాలయంలో సీఎం అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌వోడీల సదస్సు నిర్వహించారు. వృద్ధిరేటు పెంపునకు తీసుకోవాల్సిన అంశాలు, అమలు ప్రణాళికపై చర్చించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలన్నారు. అనంతపురం వేరుశనగ రైతులకు దేశంలోనే తొలిసారి ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చామని పేర్కొన్నారు. ఆ జిల్లాలో కరువు తీర్చేందుకు ఇజ్రాయెల్ సాంకేతికతను పరిశీలించామన్నారు. రాయలసీమలో పశువులకు గడ్డి కూడా దొరకని పరిస్థితి ఉండేదన్నారు. అన్నా హజారే, రాజేంద్రసింగ్ స్ఫూర్తితో జలసంరక్షణ చేపట్టామని వివరించారు.

## కారు బోల్తా.. ముగ్గురి మృతి

**అక్షరటుడే, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. జైనథ్ మండలం తరోడ సమీపంలో బుధవారం తెల్లవారుజామున కారు బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. మృతులను ఆదిలాబాద్‌లోని జైజవాన్ నగర్, లక్ష్మీనగర్ వాసులుగా గుర్తించారు. మహారాష్ట్రకు మేస్త్రీ పనికి వెళ్లి తిరిగి కారులో వస్తుండగా ప్రమాదం జరిగింది.

## హైవేపై కారును ఢీకొట్టిన విమానం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం బ్రెవర్డ్ కౌంటీలో చోటుచేసుకున్న ప్రమాదం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇంటర్ స్టేట్ -95 జాతీయ రహదారిపై వేగంగా ప్రయాణిస్తున్న కారును ఒక చిన్న విమానం ఢీకొట్టింది. ఈ ఘటనలో భారీ ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నప్పటికీ, అదృష్టవశాత్తు పెద్ద ప్రాణనష్టం తప్పింది. సాక్షుల ప్రకారం సోమవారం రాత్రి బ్రెవర్డ్ కౌంటీలోని I95 హైవేపై సింగిల్ఇంజిన్ చిన్న విమానం గాల్లోనే సమస్యలు ఎదుర్కొంది. పైలట్ అత్యవసర ల్యాండింగ్ ప్రయత్నం చేస్తుండగా నియంత్రణ కోల్పోయి నేరుగా హైవేపై దూసుకెళ్తున్న కారుపై పడింది. ఇది చూసిన వాహనదారులు భయంతో షాక్‌కు గురయ్యారు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఒక మహిళకు స్వల్ప గాయాలయ్యాయి.

## భారత్‌తో వాణిజ్య చర్చల్లో బెస్ట్ ట్రేడ్ ఆఫర్స్



**అక్షరటుడే, ఢిల్లీ:** భారత్‌అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పంద చర్చలు జరుగుతున్నాయి. చర్చల్లో భాగంగా తమకు భారత్ నుంచి అత్యుత్తమ ట్రేడ్ ఆఫర్స్ అందాయని అమెరికా వాణిజ్య ప్రతినిధి జెమీసన్ గ్రీర్ తెలిపారు. భారత వ్యవసాయ మార్కెట్‌లోకి విస్తరించే దిశగా, అడ్డంకులను అధిగమించేలా చర్చలు ఉన్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలతో పోలిస్తే తాము ఈ వాణిజ్య ఒప్పందం విషయంలో పురోగతి సాధిస్తున్నామన్నారు. అమెరికా వస్తువులకు చైనా మార్కెట్‌లో ఇబ్బందులు ఎదురవుతోన్న సమయంలో భారత్ ప్రత్యామ్నాయ మార్కెట్‌గా ఉంటుందని చెప్పారు.

## సౌదీ అరేబియాలో కుండపోత వర్షం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** సౌదీ అరేబియాలో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జెడ్డా నగరం అతలాకుతలం అవుతోంది. ఆకస్మిక వర్షాలతో మక్కా ప్రావిన్స్‌లోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. సౌదీలో మంగళవారం నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. పశ్చిమ తీరంలో ఉన్న ప్రముఖ నగరమైన జెడ్డా నగరాన్ని వరదలు ముంచెత్తాయి. రోడ్లు, వీధులు జలయమం అయ్యాయి. ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది. భారీ వర్షాలతో అధికారులు జెడ్డాలో జరుగుతున్న రెడ్ సీ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ రద్దు చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నేషనల్ సెంటర్ ఆఫ్ మెటియోరాలజీ హెచ్చరికలు జారీ చేసింది.

## మహేశ్‌ని మరిచిపోయిన కృతి సనన్



బాలీవుడ్‌లో స్థిరపడిన ఒకప్పటి టాలీవుడ్ హీరోయిన్ కృతి సనన్.. ఈ అమ్మడు బాలీవుడ్‌లో రీసెంట్ టాప్ హీరోయిన్ల కేటగిరీలోకి వచ్చేసింది. అయితే ఆమె సూపర్ స్టార్ మహేశ్‌బాబును, ఆయనతో కలిసి నటించిన సినిమాను మరిచిపోయింది. ఇటీవలే ధనుష్ కొత్త సినిమా 'తేరే ఇష్క్ మే'తో మంచి హిట్ కొట్టింది. ఈ క్రమంలో ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఇంటర్వ్యూ చేసిన వ్యక్తి ఆమెను హైట్ గురించి అడిగారు. మీరు చాలా పొడవున్నారు కదా.. మీతో కలిసి నటించిన హీరోల్లో చాలామంది మీ కంటే పొట్టివాళ్లు కదా అని అన్నారు. దానికి కృతి రియాక్ట్ అవుతూ నా హీరోలు చాలామంది నా కంటే ఎత్తు తక్కువ ఉన్నవారే. ప్రభాస్, అర్జున్ కపూర్ మాత్రమే నా కంటే పొడవైన వాళ్లు అని చెప్పింది కృతి సనన్. అయితే, ఈ క్రమంలో సౌత్‌లో ఆమె నటించిన 'వన్: నేనొక్కడినే' సినిమాను, ఆ సినిమా హీరో మహేశ్ బాబును మరిచిపోయింది. తెలుగులో పొడవు ఎక్కువగా ఉన్న హీరోయిన్లలో మహేశ్ ఒకరు. అలాంటిది మహేశ్‌ను గురించి చెప్పలేదు. ఆ సినిమా ఫలితం కారణంగా ఆమె అలా మాట్లాడిందా.. లేదా నిజంగానే మరిచిపోయిందో తెలియదు.

– అక్షరటుడే, సినిమా డెస్క్